సాక్షి ఒడిశా

బుధవారం । 20 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,42,589లు, బంగారం 130 మిల్లీగ్రాములు, వెండి 115 గ్రాముల 180 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మధ్యంతర నివేదిక సమర్పణ

భువనేశ్వర్‌లోని లోక్‌సేవ భవన్‌లో 6వ రాష్ట్ర ఆర్థిక సంఘం మధ్యంతర నివేదికను సీఎం మోహన్ చరణ్ మాఝికి సమర్పించింది.

- 8లో

నీట్‌లో సత్తాచాటిన గిరిజన విద్యార్థిని



రాష్ట్రంలో మారుమూల మల్కన్‌గిరి జిల్లాలోని కోరుకొండ మండలం నక్కమాముడి పంచాయతీ పరిధి అఖ్లిబేడ గిరిజన గ్రామానికి చెందిన విద్యార్థిని చంపా రాస్‌పెడా నీట్ పరీక్షలో సత్తాచాటింది.

- 8లో

న్యూస్‌రీల్

నవీన్ పట్నాయక్ ఆరోగ్యం కోసం పూజలు

జయపురం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ పట్నాయిక్ ఆరోగ్యం కుదుటపడాలని జయపురం బిజూ యువ జనతా దళ్ సభ్యులు సుప్రసిద్ధ గుప్తేశ్వర్‌లో మంగళవారం పూజలు నిర్వహించారు. పూజల్లో యువ బీజేడీ నేతలు బిశ్వజిత్ నాయిక్, ఘనశ్యామ్ నాయిక్, సత్య నాయిక్, పూర్ణ ధాకువ, బాసు ఖండి, రాజా పాఢి, బాపి పండ తదితరులు పాల్గొన్నారు.

నిర్దోషిగా విడుదల



భగీరథి సబర్

రాయగడ: ఒక గంజాయి సాగు కేసును విచారించిన గుణుపూర్ ఎస్‌డీజేఎం దేవదత్త పట్నాయక్ నిందితుడిని నిర్దోషిగా తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో ఈ మేరకు ఆయన తన తీర్పును వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి రామనగుడ సమితి డుమురి, డుమురిగుడ ప్రాంతాల్లో అక్రమంగా గంజాయి సాగువుతుందన్న సమాచారం మేరకు 2016వ సంవత్సరం డిసంబర్ 3వ తేదీన గుణుపపూర్ పోలీసులు, అటవీ శాఖ, ఎక్సైజ్ శాఖ సిబ్బంది దాడులు చేపట్టారు. 24 ఎకరాల విస్తీర్ణంలోని ప్రభుత్వ భూమి, మరో 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు స్థలంలో గంజాయి సాగుపై దాడులు చేపట్టి గంజాయి పంటను ధ్వంసం చేశారు. ఈ మేరకు భగీరథీ సబర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసు గుణుపూర్ ఎస్‌డీజేఎం కోర్టులో సోమవారం విచారణకు వచ్చింది. కేసు విచారించిన న్యాయస్థానం నిందితుడు భగీరథిని నిర్దోషిగా తీర్పునిచ్చింది.

బోటు మునిగి ఒకరు గల్లంతు



లండ రామారావు (ఫైల్)

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని బ్లాక్ గారబంద పోలీసుస్టేషన్ పరిధి లావణ్యగడ పంచాయతీలోని రాధా సాగరంలో మంగళవారం బోటు మునిగిపోయింది. ప్రమాద సమయంలో బోటులో ఉన్నటువంటి నలుగురిలో ముగ్గురు వ్యక్తులు ఈతకొట్టి ఒడ్డుకు చేరుకోగా ఒకరు గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలంలో పెద్దహంస గ్రామానికి చెందిన లండ రామారావు (40)గా గుర్తించారు. పర్లాకిమిడి నుంచి ఓడ్రాఫ్ బృందం సంఘటన స్థలానికి చేరుకొని రాధాసాగరంలో గాలించినా రామారావు ఆచూకీ లభించలేదని ఐఐసీ ప్రశాంత్ నిషిక తెలియజేశారు. రాధాసాగరం ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు చేరడంతో నిండు కుండలా మారింది. ఘటనపై గారబంద పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

చేతబడి నెపంతో వ్యక్తిపై దాడి



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న భాష

రాయగడ: చేతబడి నెపంతో ఒక యువకుడిపై దాడి జరిగిన ఘటన జిల్లాలోని శశిఖాల్ పోలీస్‌స్టేషన్ పరిధి బొడొలుకుటి గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. బొడొలుకుటి గ్రామంలో నివాసముంటున్న భాషా మండంగి అనే వ్యక్తి చేతబడి చేస్తున్నాడని అనుమానించిన గ్రామస్తులు జూలై 30వ తేదీన రాత్రి అతడి ఇంట్లో చొరబడి దాడి చేశారు. ఇంటి నుంచి ఈడ్చుకుంటూ వెళ్లి గ్రామం బయట ఒక చెట్టుకు కట్టేసి తీవ్రంగా గాయపరిచి విడిచిపెట్టారు. తీవ్రగాయాలకు గురైన భాషాను అతని కుటుంబ సభ్యులు జిమిడిపేట ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు. అయితే తన భర్తపై కొందరు గ్రామస్తులు అమానుషంగా దాడి చేశారని ఆగస్టు 1వ తేదీన భాష భార్య చింతా కొండగిరి శశిఖాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గ్రామానికి చెందిన రామ కొండగిరి, గౌరి కొండగిరి, జగన్నాథ కొండగిరి అనే ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని విచారించిన అనంతరం వారిని విడిచిపెట్టారు. ఇంటి వద్దే ఉంటూ గాయాలతో చికిత్స పొందుతున్న భాష ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ విషమించడంతో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అతని భార్య చికిత్స కోసం తరలించడంతో విషయం బయటపడింది. దాడి చేసినవారిని పోలీసులు అరెస్టు చేయకుండా ఎందుకు విడిపెట్టారో తెలియడం లేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై పోలీసులు మౌనం వహిస్తున్నారు.



మెరుగులు దిద్దుకుంటున్న వినాయక విగ్రహాలు



రంగులు అద్దుతున్న యువతులు

మట్టిని తీసి.. ప్రాణం పోసి..!

- మట్టి విగ్రహాల్లో దిట్ట అమలాభట్ట
- వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న 100 కుటుంబాలు
- వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు లభ్యం

మనం చేసుకునే పండగలు వెనుక ముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్కరూ ప్రకృతితో మమేకం అవ్వడం. కానీ ఆధునిక పోకడలు పర్యావరణ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వినాయక చవితి ఉత్సవాల్లో ఉపయోగిస్తున్న ప్లాస్టర్ ఆఫ్ ఫారిస్‌తో తయారు చేస్తున్న విగ్రహాలు పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. దీనివలన జీవకోటికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. అందువలన ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వినియోగించాలనే సంకల్పంతో అమలాభట్ట గ్రామస్తులు మట్టితో విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. వీటిని ఉపయోగించడం వలన పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఇలా మట్టి మేలు తలపెడుతున్న వారిని ఒకసారి పలకరిస్తే...

– రాయగడ

రాయగడ జిల్లా కేంద్రానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో అమలాభట్ట గ్రామం ఉంది. ఈ గ్రామంలోని సుమారు 100 కుటుంబాలు మట్టినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాయి. వీరు ప్రకృతిహితంగా విగ్రహాలను తయారు చేస్తుంటారు.



విగ్రహాలకు రంగులు అద్దుతున్న కళాకారుడు

కేవలం మట్టినే ఉపయోగించి అందమైన విగ్రహాలను తయారు చేయడంలో అమలాభట్ట గ్రామానికి ప్రత్యేకత ఉంది. ప్రతీ ఏడాది వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలు వంటి ప్రత్యేక దినాల్లో విగ్రహాల తయారీలో ఇంటిల్లపాది నిమగ్నమవుతుంటారు. ఈ ఏడాది కూడా వినాయక ఉత్సవాలకు సంబంధించి విగ్రహాల తయారీ ఊపందుకున్నాయి. మూడు నెలల ముందుగానే విగ్రహాలను రూపొందించడంలో నిమగ్నమైన యువతీ, యువకులు రేయింబవళ్లు కష్టించి విగ్రహాలను తయారీ చేస్తున్నారు. మూడు నెలల పాటు కష్టపడి పనిచేస్తే సుమారు రూ.50 వేల వరకు ఆదాయం ఒకొక్కరికీ లభిస్తుందని చెబుతున్నారు. అయితే గత మూడేళ్లుగా తమ వ్యాపారాలు చాలా మందకొడిగా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వినాయక విగ్రహాలకు సంబంధించి సహజ రంగులు ధరలు ఆకాశానంటుతుండడంతో పాటు ప్లాస్టర్ ఆఫ్ ఫారిస్‌తో రూపొందించిన విగ్రహాల విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో మట్టి విగ్రహాలకు గిరాకీ తగ్గుతోందని చెబుతున్నారు.

బాల వినాయకులకు గిరాకీ

ఈ ఏడాది ఆర్డర్లు ఇచ్చేవారు బాల వినాయకుల ప్రతిమలకు అత్యంత ప్రాధాన్యమివ్వడంతో పాటు ఆర్డర్లకు అనుకూలంగా విగ్రహాలను తయారు చేస్తుండడం విశేషం. మువ్వగోపాలుడు, బాల వినాయకుడు వంటి వేషధారణల్లో ఈ ఏడాది వినాయకుల విగ్రహాలు దర్శనం ఇవ్వనున్నాయి. రాయగడ జిల్లాలోని గుణుపూర్, గుడారి, మునిగుడ, పద్మపూర్ వంటి ప్రాంతాలతో పాటు గజపతి జిల్లా నుంచి అదేవిధంగా పొరుగు రాష్ట్రమైన మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన వారు కూడా ఈసారి వినాయక విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చారు.

ముందస్తు ఆర్డర్ల ప్రకారమే...

ఇదివరకు వినాయక చవితి దగ్గరపడుతుందంటే ఆరు నెలల ముందే విగ్రహాల తయారీకి సిద్ధమయ్యేవారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి ఆర్డర్లు బాగానే వస్తుండేవి. చేసిన వినాయక విగ్రహాలన్నీ దాదాపు అమ్ముడయ్యేవి. అయితే ప్రస్తుతం ప్లాస్టర్ ఆఫ్ ఫారిస్ విగ్రహాల విక్రయాలు జోరందుకోవడంతో వీరి వ్యాపారాలు మందకొడిగా మారాయి. మట్టినే నమ్ముకున్న వీరి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ప్రత్యేక దినాల్లో తప్పా మిగతా రోజుల్లో వ్యాపారాలు కొనసాగక ఇతర పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అందువల్ల గత రెండేళ్ల నుంచి ఆర్డర్లు వచ్చేంత వరకు మాత్రమే విగ్రహాలను కళాకారులు రూపొందిస్తున్నారు. మట్టినే నమ్ముకుని జీవనాధారంగా పలువురు ఏటా తీరైన మట్టి విగ్రహాలను రూపొందిస్తూ తమ జీవనాన్ని సాగిస్తూ పుడమిపై మమకారాన్ని చాటుకుంటున్నారు.

డైలీ మార్కెట్‌లో విగ్రహాలు

చిన్న చిన్న విగ్రహాలను ఈ గ్రామానికి చెందిన యువతులు రూపొందిస్తున్నారు. వాటిని స్వయంగా తయారు చేసి రంగులు అద్ది, పూర్తయిన తర్వాత చవితికి మూడు రోజుల ముందుగానే రాయగడ పట్టణంలోని మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ప్రతీ ఏడాది మహిళలు వినాయక చవితి సందర్భంగా కష్టపడి విగ్రహాల తయారీతో పాటు వాటిని విక్రయించి కొంతమొత్తం ఆదాయం సంపాదించుకుని కుటుంబ పోషణకు అండగా నిలుస్తుంటారు.

మహిళలమే రూపొందిస్తుంటాం



వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతీ ఏడాది చిన్న చిన్న విగ్రహాలను మహిళలమే రూపొందిస్తుంటాం. తయారీ పూర్తయితే రంగులు అద్ది వాటిని మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తుంటాం. రూ.10ల నుంచి రూ.100ల వరకు విగ్రహాలను రూపొందిస్తుంటాం. అయితే కొనుగోలుదారులు మా కష్టానికి తగ్గ ఆలోచించకుండా బేరసారాలు అడుతుంటారు. విక్రయాలు మందకొడిగా ఉంటే ఒకొక్కసారి గిట్టుబాటు ధర లేకపోయినప్పటికీ విక్రయించాల్సి వస్తుంది. ఒకవేళ అలా విక్రయించకపోతే పెట్టుబడి కూడా నష్టపోతాం.

– పొందూరు లక్ష్మి, అమలాభట్ట

షెడ్డు నిర్మిస్తే ప్రయోజనం



గ్రామంలో సుమారు వంద కుటుంబాలు మట్టినే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాయి. వర్షం వస్తే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. చేసిన విగ్రహాలు వర్షాలకు తడిచి పాడవుతున్నాయి. పాలిథిన్ ఖరీదు చేసి వర్షం కురిసే సమయంలో విగ్రహాలను కప్పుకోవాల్సి వస్తోంది. అదే గ్రామంలో అందరి కోసం షెడ్డు ఉంటే అంతా అక్కడే విగ్రహాలు తయారీ చేసుకునే అవకాశం ఉండేది. షెడ్డు లేకపోవడంతో ఎవరి ఇంట్లో వారే విగ్రహాలను తయారు చేసుకోవాల్సిన పరిస్థితి. భారీ వినాయకుల తయారీ కోసం బయట వేరొకరిపై ఆధారపడాల్సి వస్తోంది.

– వంజరాపు రాజేష్, అమలాభట్ట

అధికారులు దృష్టి సారించాలి



గత రెండేళ్లుగా వచ్చిన ఆర్డర్ల ప్రకారమే విగ్రహాలను రూపొందిస్తున్నాం. ఆర్డర్లు లేకుండా తయారు చేస్తే అవి విక్రయాలు జరగక నష్టపోవాల్సి వస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ ఫారిస్ విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తున్నా, వాటి ఆదరణే అధికమవ్వడంతో మా వ్యాపారాలు దె దెబ్బతింటున్నాయి. మట్టినే నమ్ముకున్న మా కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయి. జిల్లా యంత్రాంగం వాటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


– పి.వెంకటరావు, అమలాభట్ట




బాల గణపతి విగ్రహం



మువ్వగోపాలుడిగా రూపొందుతున్న గణనాథుడు



బాల గోపాలుడిగా గణపతి



వివిధ రూపాల్లో గణనాథులు



మెరుగులు దిద్దుకుంటున్న వినాయక విగ్రహాలు

బస్సు ఢీకొని ఒకరు దుర్మరణం



ఆందోళన చేపడుతున్న మృతుడి కుటుంబ సభ్యులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి ఝొడొగుడ గ్రామం 26వ జాతీయ రహదారిలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. మరణించిన వ్యక్తి బొరిగుమ్మ సమితి కమతా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నారాయణ జానిగా గుర్తించారు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాద వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ జాని తన మిత్రుడితో కలిసి బైక్‌పై బొరిగుమ్మ వైపు వస్తున్నారు. వారి వెనుక ఒక ప్రైవేట్ బస్సు వస్తూ బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై వస్తున్న నారాయణ, అతడి మిత్రుడు ఎగిరి పడ్డారు. ఈ ఘటనలో నారాయణ జాని సంఘటనా స్థలం వద్దనే మరణించాడు. ప్రస్తుతం నారాయణ జాని బొరిగుమ్మ రాజ మేస్త్రీ సంఘ కార్యదర్శి. నారాయణ ప్రమాదంలో మరణించినట్లు తెలిసిన వెంటనే రాజమేస్త్రీ సంఘ సభ్యులు, అతడి బంధువులు ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆందోళనతో 26వ జాతీయ రహదారికి ఇరువైపులా అనేక వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే బొరిగుమ్మ అదనపు తహసీల్దార్ సతీష్ కుమార్ బొయిని, పోలీసులు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. అధికారులు ఇచ్చిన హామీలకు అంగీకరించి రాత్రి 8 గంటల సమయంలో ఆందోళన విరమించడంతో రాకపోకలు మరలా కొనసాగాయి. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.



ఆందోళనకారులతో చర్చిస్తున్న అధికారులు

మైనర్ బాలికపై అత్యాచారం

- నిందితుడి అరెస్టు



అరెస్టైన రోహణ్ నాగ్

జయపురం: ఒక మైనర్ బాలికను అపహరించి అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్ వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి స్థానిక గోపబంధునగర్‌కు చెందిన రోహణ్ నాగ్ ఉరఫ్ రాజేంద్రగా పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని ఒక వీధిలో నివాసముంటున్న మైనర్ బాలిక గత జూలై 10వ తేదీన తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఇద్దరు యువకులు వచ్చి ఆ బాలికను బలవంతంగా ఒక వాహనంలో తీసుకెళ్లిపోయారు. ఈ విషయం ప్రత్యక్షంగా చూచినవారు బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో గాలించినా బాలిక ఆచూకీ లభించలేదు. దీంతో జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ ప్రాంతాల్లో గాలించారు. అయినా ఆమె జాడ తెలియలేదు. ఎట్టకేలకు నవరంగపూర్ జిల్లా పపడహండిలో బాలిక ఉన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలియడంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ మైనర్ బాలికతో పాటు నిందితుడిని అరెస్టు చేశారు. బాధితురాలిని వైద్య పరీక్షలు నిర్వహించి వాగ్మూలం రికార్డు చేసినట్లు పేర్కొన్నారు. మైనర్ బాలిక అపహరణ, అత్యాచారం జరిపిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

గొంతెండుతోంది..!



రాయగడ జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి గ్రామంలోని లడొంగిరియా వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో సికరపాయి నుంచి కల్యాణ సింగుపూర్, కాసీపూర్ తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వీధిలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. అందరి దాహాన్ని తీర్చేందుకు ఒకే గొట్టపు బావి ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న బీడీవో సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయితే అందుకు వారు అంగీకరించకపోవడంతో, రాయగడ సబ్ కలెక్టర్ రమేష్ చంద్ర జెన్న చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

– రాయగడ

క్లుప్తంగా

లారీ డ్రైవర్‌కు జైలుశిక్ష

ఎచ్చెర్ల : మద్యం మత్తులో లారీని నడుపుతూ ప్రమాదానికి కారణమైన విజయవాడకు చెందిన డ్రైవర్ నాగరాజుకు జిల్లా సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ 60 రోజుల జైలు శిక్ష విధించారు. ఎచ్చెర్ల మండలం కింతలి మిల్లు జంక్షన్ వద్ద సోమవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి వస్తున్న లారీ డ్రైవర్ నాగరాజు రాంగ్‌రూట్‌లో డ్రైవ్ చేస్తూ విశాఖ నుంచి ఒడిశా వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఒడిశా లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మద్యం మత్తులో లారీని నడిపిన డ్రైవర్ నాగరాజుపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించగా 60 రోజులు జైలు శిక్షను విధించారని ఎస్సై సందీప్‌కుమార్ మంగళవారం తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితురాలు

మెళియాపుట్టి: పట్టుపురంలో కాంచనే అనే మహిళపై దాడి చేసి పారిపోయిన ఘటనలో అనుమానితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పాతపట్నం సీఐ వి.రామారావు తెలిపారు. పూర్తి వివరాలు బుధవారం తెలియజేస్తామన్నారు.

రాత్రిపూట యూరియా అమ్మకాలా?

- అనుమానాలు వ్యక్తం చేస్తున్న రైతులు



మంగళవారం రాత్రి ఆటోల్లో యూరియా లోడ్ చేస్తున్న కలాశీలు

నరసన్నపేట: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటైన సొసైటీల్లో చీకటి పద్ధాక యూరియా అమ్మకాలు చేస్తుండటం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. నరసన్నపేట సొసైటీకి మూడు రోజుల కిందట 400 బస్తాల యూరియా వచ్చింది. ఆదివారం రైతులు అధికంగా చేరడం.. వాగ్వాదం జరగడంతో యూరియా పంపిణీ చేయలేదు. రెండో రోజు కొంత మంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున ఇచ్చారు. మిగిలిన యూరియాను మంగళవారం రాత్రి విక్రయాలు చేపట్టారు. ఆటోలు, లగేజి వాహనాల్లో బస్తాలను ఇష్టానుసారంగా సరఫరా చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకు ఇవ్వాల్సిన యూరియా పక్కతోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడంతో సొసైటీకి వచ్చిన యూరియా పక్క దారి పట్టిందని, కావాల్సిన వారికి లెక్కకు మించి పంపిణీ చేశారని పలువురు రైతులు అంటున్నారు.

అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టు రాత పరీక్ష ఆగస్టు 10న నిర్వహించగా.. ఫలితాలు, ప్రొవిజనల్ జాబితా జిల్లా వెబ్‌సైట్ srikakulam.a p.gov.inలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంచుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను ఈ నెల 22లోగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. మార్కులపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా నిర్దేశిత తేదీ సాయంత్రం 5 గంటల లోగా శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారికి నేరుగా తెలియజేయవచ్చని తెలిపారు.

మధ్యంతర నివేదిక సమర్పణ



సీఎం మోహన్‌చరణ్‌కు నివేదిక సమర్పిస్తున్న అరుణ్ కుమార్ పండా

భువనేశ్వర్: స్థానిక లోక్‌సేవ భవన్‌లో 6వ రాష్ట్ర ఆర్థిక సంఘం మధ్యంతర నివేదికను సీఎం మోహన్ చరణ్ మాఝికి సమర్పించింది. ఈ సందర్భంగా కమిషన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ పండా ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ అసిత్ రంజన్ మహంతి, ప్రొఫెసర్ అమరేష్ సామంతరాయ్, బిభు ప్రసాద్ నాయక్, సభ్య కార్యదర్శి డాక్టర్ సత్య ప్రియ రథ్, ఎక్స్- అఫీసియో సభ్యుడు అరిందం డకువా ముఖ్యమంత్రిని కలిసి సమావేశమయ్యారు. కమిషన్ వివిధ సిఫార్సులను వారు ముఖ్యమంత్రికి వివరించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ మరియు పట్టణ స్థానిక సంస్థల మధ్య రాష్ట్ర ఆదాయాల పంపిణీ నియంత్రణ వ్యవస్థ బలోపేతం దిశలో పలు సిఫార్సులతో నివేదిక రూపుదిద్దుకున్నట్లు తెలిపారు. ఈ సంస్థల ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం ఆర్థిక సంఘం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. మధ్యంతర నివేదిక స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్ల దృష్ట్యా తక్షణ ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు దోహదపడుతుంది. నిర్ణీత కాల పరిమితిలో తుది నివేదికను సమర్పించాలని కమిషన్ యోచిస్తోంది. రాష్ట్రం వసూలు చేసే పన్నులు, సుంకాలు, టోల్‌లు మరియు రుసుముల కేటాయింపును క్రమబద్ధీకరించడానికి కీలకమైన సూచనలను ప్రతినిధి బృందం చర్చించింది. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, తాగునీటి శాఖ మంత్రి రబీ నారాయణ్ నాయక్, గృహ నిర్మాణం – పట్టణాభివృద్ధి మరియు ప్రభుత్వ సంస్థల విభాగం మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రో, ప్రధాన కార్యదర్శి మనోజ్ ఆహుజా, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి శాశ్వత్ మిశ్రా, గృహ నిర్మాణం – పట్టణాభివృద్ధి విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషా పాఢి, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజీవ్ కుమార్ మిశ్రా, పంచాయతీ రాజ్ డైరెక్టర్ వినీత్ భరద్వాజ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



కమిషనర్ గిరీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న లిమామోడా గ్రామస్తులు

రాయగడ: రాష్ట్ర నీటి పారుదల, పంచాయతీరాజ్ శాఖల కార్యదర్శి, కమిషనర్ ఎస్.ఎన్.గిరీష్‌కు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ లిమామెడా గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పద్మపూర్, గుణుపూర్‌లలో సోమవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. లిమామోడ గ్రామంలో గత కొన్నేళ్లుగా తాగునీటి సమస్య వేధిస్తోందని వివరించారు. గుణుపూర్‌లోని మెగా తాగునీటి ప్రాజెక్టు ద్వారా తమ గ్రామానికి నీరు అందేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ గిరీష్ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామానికి భవిష్యత్‌లో తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.

విదేశీ మద్యంతో ఇద్దరు అరెస్టు



సీజ్ చేసిన కారు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ వారాంతపు మార్కెట్ వద్ద ఎక్సైజ్, విజిలెన్స్ స్క్వాడ్ ఒక కారును వెంబడించి పట్టుకున్నారు. కారులో 17 లీటర్ల 600 మిల్లీ లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కారు సీజ్ చేశారు. ఈ అక్రమ విదేశీ మద్యం రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు బబులా సాహు, బిజయ్ చౌదరిలను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. ఈ మద్యాన్ని గజపతి జిల్లాలోని నువాగడ, ఖోజురిపద, సెరంగో, నారాయణ్‌పూర్, కోయిపూర్, జిరంగో, రామగిరికి తరలిస్తున్నట్లు కటక్ ఎక్సైజ్ కమిషనర్ పి.అన్వేషా రెడ్డి తెలిపారు. రాయఘడ లిక్కర్ హోల్‌సేల్ షాపు సీసీటీవీ ఫుటేజీని ఎక్సైజ్ కమిషనర్ పరిశీలిస్తున్నారు. దాడుల్లో హీరా దళపతి, బ్రజ కిషోర్ బింధాని, ఎస్‌ఐ షేక్ షకువాల్, కానిస్టేబుల్ గౌరంగ నాయక్, పద్మినీ నాయక్, పవిత్రా కుమార్ దాస్‌లు ఉన్నారు. నిందితులను బుధవారం ఉదయం కోర్టులో హాజరు పరుస్తామని అబ్కారీ కమిషనర్ పి.అన్వేషా రెడ్డి తెలియజేశారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు జిల్లాలో ఆరు కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. టెక్కలి, పలాస, రాజాం, పాలకొండల్లో ఒక్కో కేంద్రం, శ్రీకాకుళంలో రెండు కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 14 బీఈడీ కళాశాలలకు చెందిన సుమారు 1100 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ నెల 22 వరకు పరీక్షలు కొనసాగుతాయని పరీక్షల డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. కాగా ఈ నెల 18న క్యాంపస్ కేంద్రంగా జరగాల్సిన మూడు, ఐదేళ్ల న్యాయ విద్య సెమిస్టర్ పరీక్షలను వర్షాల కారణంగా వాయిదా వేశామని, వీటిని సెప్టెంబర్ 2న నిర్వహిస్తామని చెప్పారు.

దారుణం

- భార్యకు ఆడపిల్లలు పుడుతున్నారని రెండో పెళ్లికి భర్త సిద్ధం
- భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు

భువనేశ్వర్: భార్యకు వరుసగా ఆడపిల్లలు పుడుతుండడంతో రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు ఒక ప్రబుద్ధుడు. వివరాల్లోకి వెళ్తే.. కేంద్రాపడా జిల్లా పట్టాముండై మండలం తనుపూర్ గ్రామానికి చెందిన కిషోర్ అతని భార్యకు వరుసగా ఆడపిల్లలు పుడుతున్నారని చెప్పి రెండో పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు. ఇటీవలే కిషోర్ దంపతులకు నాలుగో కాన్పులోనూ ఆడపిల్ల జన్మించడంతో భార్యకు చెప్పకుండా కోర్టులో మరోపెళ్లి చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. అయితే ఈలోపు సమాచారం భార్యకు తెలియడంతో హుటాహుటిన నవజాత శిశువుతో కోర్టు వద్దకు వెళ్లింది. అక్కడ తన భర్తతో గొడవకు దిగింది. విషయం తెలియడంతో స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి విచ్చేశారు. పెళ్లి కొడుకు బండారం బట్టబయలు చేసి భర్త రెండో పెళ్లిని ఆపాలని కోరింది. ఇంతటితో ఆగకుండా కోర్టు ప్రాంగణంలో ధర్నాకు దిగింది. ఆడబిడ్డలను ప్రసవించడం ఘోరమైన అపరాధంగా పరిగణించి పసిపిల్లలను నిర్లక్ష్యంగా నిత్యం చావగొడుతున్న తాగుబోతు భర్తపై చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో పోలీసులు భర్తను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

హత్య కేసు నిందితుడికి యావజ్జీవం

రాయగడ: ఒక హత్య కేసుకు సంబంధించి జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. అదేవిధంగా మరో రూ.20 వేల జరిమానా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. 2022వ సంవత్సరంలో స్థానిక కొయిలాపడలో నివసిస్తున్న గంగమ్మ గౌరాడియ అనే మహిళను ఆమె అల్లుడు నవీన్ కొంథొపాణి హత్య చేశాడు. ఈ కేసులో పోలీసులు అతడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మంగళవారం కేసు పూర్వాపరాలు విచారించిన జడ్జి ఈ మేరకు నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో అదనంగా మరో రెండేళ్ల పాటు జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మిశ్రో మృతదేహం

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మృతుడు జేకేపూర్ ప్రాంతానికి చెందిన త్రినాథ్ మిశ్రో(56)గా గుర్తించారు. జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ పరిధి జేకేపేపర్ మిల్ సమీపంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంటి నుంచి బైకుపై ఏదో పనిమీద చందిలి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలు పాలైన మిశ్రోను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయాల్లో చోరీ

నందిగాం : నరేంద్రపురంలోని రెయ్యిబోడెమ్మ, భూలోకమాత అమ్మవారి ఆలయాల్లో సోమవారం రాత్రి పూజా సామగ్రి చోరీకి గురైంది. ఈ ఏడాది మార్చి 9న గ్రామ శివారులో గ్రామదేవతల ఆలయాలకు ప్రతిష్ఠాపన చేశారు. నిత్య పూజలకు అవసరమైన వెండి, ఇత్తడి సామాన్లు సమకూర్చుకున్నారు. సోమవారం సాయంత్రం పూజ కార్యక్రమాలు పూర్తయ్యాక తలుపులు వేసి గ్రామస్తులు వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి రెండు ఆలయాల్లో రెండు వెండి శతగోపాలు, రెండు ఇత్తడి బిందెలు, నాలుగు ఇత్తడి పల్లేలు, నాలుగు దీపస్తంభాలు, రెండు గంటలు, రెండు పూలసజ్జలు చోరీకి గురయ్యాయి. హుండీలో ఉన్న డబ్బులు సైతం పట్టుకుపోయారు. గ్రామస్తులు నందిగాం పోలీసులకు సమాచారం తెలియజేయగా సిబ్బంది వచ్చి పరిశీలించారు.



భద్రక్‌లో గవర్నర్ పర్యటన

మహిళలతో మాట్లాడుతున్న గవర్నర్ హరిబాబు

భువనేశ్వర్: రాష్ట్రంలోని భద్రక్ జిల్లాలో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి మంగళవారం పర్యటించారు. బొడొబార్చికయన్ ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్‌ను సందర్శించారు. స్వావలంబన, గ్రామీణ పరివర్తన, సమ్మిళిత వృద్ధిని పెంపొందించడంలో ఇక్కడి వారి ప్రయత్నాలను ప్రశంసించారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. కొడొబారంగొ గ్రామీణ పారిశ్రామిక పార్కు సందర్శించి స్వయం సహాయక బృందాలు, ఉత్పత్తిదారుల బృందాలు మరియు లఖ్‌పతి దీదీలతో సంభాషించారు. ఈ సంభాషణలో స్వావలంబన, మహిళా సాధికారత మరియు సామాజిక గ్రామీణ సంస్థల స్ఫూర్తిదాయకమైన అనుభవాలను పంచుకున్నారు.

నీట్‌లో సత్తాచాటిన గిరిజన విద్యార్థిని



చంపా రాస్‌పెదా

భువనేశ్వర్: రాష్ట్రంలో మారుమూల మల్కన్‌గిరి జిల్లాలోని కోరుకొండ మండలం నక్కమాముడి పంచాయతీ పరిధి అమ్లిబేడ గిరిజన గ్రామానికి చెందిన విద్యార్థిని చంపా రాస్‌పెదా నీట్ పరీక్షలో సత్తాచాటింది. నీట్ 2025లో అర్హత సాధించడంతో బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ మెడికల్ కాలేజ్ – ఆస్పత్రిలో సీటు సాధించింది. విద్యార్థిని తండ్రి సన్నకారు రైతు, తల్లి సాధారణ గృహిణి. చిత్రకొండ ఎస్ఎస్‌డీ బాలికల ఉన్నత పాఠశాలలో 2019 సంవత్సరంలో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత సాధించింది. 2021 సంవత్సరంలో గోవిందపల్లి ఎస్ఎస్‌డీ ఉన్నత మాధ్యమిక పాఠశాల నుంచి +2 సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించి, బీఎస్సీ చదివేందుకు ఆర్థిక స్తోమత లేక డిగ్రీ చదువుకు స్వస్తి పలికింది. అయితే డాక్టర్ కావాలనే కల సాకారం చేసుకోవాలనే పట్టుదలతో ఏమాత్రం సడలిపోకుండా తన వంతు ప్రయత్నంలో తలమునకలైంది. బాలిక మేధస్సు, పట్టుదలని గుర్తించిన ఆమె మాజీ సైన్స్ ఉపాధ్యాయుడు ఉత్కళ కేశరి దాస్ మార్గదర్శిగా కల సాకారం చేయడంలో చేయూతనిచ్చారు. ఆశయ సాధనకు అందిన అవకాశం సద్వినియోగపరచుకుని బాలసోర్‌లోని ఉచిత నీట్ కోచింగ్ తరగతుల్లో చేరింది.

ఈ కేంద్రంలో పొందిన శిక్షణతో తొలి ప్రయత్నంలోనే నీట్ పోటీ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సరికొత్త చరిత్రని ఆవిష్కరించింది. చంపా రాస్‌పెదా ఉత్తీర్ణతపై సీఎం మోహన్ చరణ్ మాఝి అమితానందం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



దాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక ప్యాలెస్ వీధిలో గజపతి జిల్లా ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ సంఘం (ఐప్పు) ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాయాచిత్రాల సృష్టికర్త లూయిస్ దాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కార్యదర్శి రెడ్డి శ్రీను, ఉపాధ్యక్షుడు ఢిల్లీ, సలహాదారులు శివ, గిరి, సమీర్, సురేష్ బాలు, గంగాధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న రెవెన్యూ ఉద్యోగుల సమ్మె



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అమలా సంఘం సభ్యులు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ వద్ద ఒడిశా రెవెన్యూ ఉద్యోగుల సంఘం సమ్మె మంగళవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. దీంతో కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు తమ పనులు జరగకపోవడంతో వెనుదిరుగుతున్నారు. రెవెన్యూ మినిస్టీరియల్ ఉద్యోగులకు ప్రారంభ మూల వేతనం పెంచాలని, అలాగే పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చర్చలకు రాలేదు. సమ్మె కాలంలో జీతాలు ఆపివేస్తామని, ఎస్మా చట్టం ప్రయోగిస్తామని హెచ్చరిస్తున్నారని రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యదర్శి సంతును మిశ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హెచ్చరికలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఆందోళనలో ఉపాధ్యక్షుడు సోరెన్ శంకర్‌లాల్, రెవెన్యూ అమలా సంఘం అధ్యక్షుడు జుధిష్టర్ రణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు



తెలింగిరిలో జలకళ

జయపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కొరాపుట్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గత 24 గంటల్లో 880.32 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్ సమితిలో అత్యధికంగా 150 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అతి తక్కువ వర్షపాతం నారాయణపట్న సమితిలో 26.4 మి.మీ నమోదయ్యింది. అయితే బొయిపరిగుడ సమితిలో 143 మి.మీ, దశమంతపూర్‌లో 30 మి.మీ, లక్ష్మీపూర్‌లో 35.2 మి.మీ, సెమిలిగుడలో 53 మి.మీ, జయపురంలో 46.6 మి.మీ, కుంద్ర సమితిలో 42.4 మి.మీ, లమతాపుట్ సమితిలో 79 మి.మీ, పొట్టంగిలో 59.6 మి.మీ, మందుగాం సమితిలో 54 మి.మీ, నందపూర్ సమితిలో 55 మి.మీ, బొరిగుమ్మ సమితిలో 36 మి.మీ, కొరాపుట్ సమితిలో 73 మి.మీ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

వర్షాలతో మాచ్‌ఖండ్, అప్పర్ కొలాబ్, తెలింగిరి జలాశయాల్లో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. బొయిపరిగుడ సమితి బలిగాం పంచాయతీలో కంగుగుడ గ్రామం వద్ద నది నీటి ప్రవాహంతో పొంగిపొర్లుతోంది. దీంతో ఆ నదీ ప్రవాహిక ప్రాంతంలోని కంగుగుడ, అటల్‌గుడ, జలియగుడ గ్రామాలతో పాటు సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఓ బొజ్జ గణపయ్య..
జీవనాధారం నీవేనయ్య..!

- విగ్రహాల తయారీనే నమ్ముకున్న కళాకారులు
- స్థానికులతో పాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి రాక
- ట్రెండ్‌కు తగ్గట్టు రూపుదిద్దుకుంటున్న విగ్రహాలు
- వారం రోజుల్లో నవరాత్రి ఉత్సవాలు



తుదిమెరుగులు దిద్దుతున్న మహిళా కళాకారులు

వజ్రపుకొత్తూరు రూరల్ :

వినాయక చవితి సందడి మరో వారం రోజుల్లో మొదలుకానుంది. భాద్రపద శుక్లపక్ష చవితి నాడు ప్రారంభమై నవరాత్రులు ఎంతో వైభవంగా జరుపుకునే ఈ ఉత్సవం ఈ నెల 27న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కళాకారులు విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. విగ్రహాలు తయారు చేసే కళను నమ్ముకొని వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఏడాదికి ఒకసారి వచ్చే వినాయక చవితి ఉత్సవాలకు అవసరమైన బొజ్జ గణపయ్య విగ్రహాలను కళాకారులు తయారు చేసి ఏడాదికి సరిపడ ఆదాయాన్ని అర్జించి కుటుంబాన్ని పోషిస్తుంటారు. ప్రధానంగా ఈ సీజన్‌లో రాజస్థాన్, కోల్‌కత్తా, రాజమండ్రి తదితర ప్రాంతాలలో పాటు జిల్లాలో ఉన్న పొందూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి, కాశీబుగ్గ, హరిపురం తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 200 విగ్రహ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది కళాకారులు, వ్యాపారులు, కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఉత్సవాలకు మూడు నెలల ముందు విగ్రహాల తయారీ కేంద్రాలను ఎంపిక చేసుకొని అవసరమైన ముడి సామగ్రిని లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసుకొని సేకరించి నిల్వపెట్టుకున్నారు. రెండు నెలల ముందు విగ్రహాలను తయారీ చేయడం ప్రారంభించారు. ఉత్సవానికి సమయం దగ్గర పడటంతో విగ్రహాలకు తుది మెరుపులు దిద్దుతున్నారు.

ట్రెండింగ్‌కు అనుగుణంగా..

ఏటా ట్రెండింగ్‌లో ఉన్న వినాయక విగ్రహాలకు ఆదరణ పెరుగుతోంది. పూజా కమిటీ నిర్వాహకుల అభిరుచికి తగ్గట్టుగా రకరకాల ఆకృతిలో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. 2 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారీ చేసి మార్కెట్‌లో అమ్మకాల కోసం సిద్ధం చేస్తున్నారు. విగ్రహాల మోడల్, సైజ్ బట్టి ఒక్కొక్క విగ్రహాన్ని రూ.2 వేల నుంచి రూ.20 వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు. కళాకారులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి విగ్రహాలు తయారీ చేస్తున్నారు. అయితే తాము ఆశించిన స్థాయిలు విగ్రహాలు అమ్ముడుపోతేనే తమ కుటుంబ పోషణకు భరోసా దొరుకుతుందని, లేదంటే నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కళాకారులు చెబుతున్నారు.



విగ్రహాలను ఆసక్తిగా తిలకిస్తున్న యువకులు

క్లుప్తంగా

మాజీ సైనికులకు లీగల్ సర్వీసెస్ క్లినిక్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: మాజీ సైనిక ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి,, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. వీర్ పరివార్ సహాయత యోజన స్కీమ్ 2025ను అనుసరించి ప్రతి జిల్లాలోనూ లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను ప్రారంభించి మాజీ సైనిక ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు న్యాయ సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కేవీఎస్ ప్రసాద రావు, న్యాయవాది ధనుంజయరావు, పారా లీగల్ వలంటీర్ జి.రమణ, పెద్దసంఖ్యలో మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

29న స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ వైరెడ్‌లో ఈ నెల 29న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులన్నారు. పురుషులకు సెల్‌ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసింగ్ (30 రోజులు), జెంట్స్ టైలరింగ్ (31 రోజులు), రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషన్ (75 రోజులు), హౌస్ వైరింగ్ (30 రోజులు), సీసీటీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ (13 రోజులు), ప్లంబింగ్ అండ్ శానిటరీ వర్క్స్ (30 రోజులు), అలాగే స్త్రీలకు హోం నర్సింగ్ (25 రోజులు), లేడీస్ టైలరింగ్ (31 రోజులు), బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ (35 రోజులు), కంప్యూటర్ డీటీపీ (45 రోజులు)లో శిక్షణ ఉంటుందని అన్నారు. ఇంటర్వ్యూకు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో హాజరు కావాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129, 9866913371, 9989953145 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై కక్ష సాధింపు సరికాదు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన

నెల్లిమర్ల రూరల్: శ్రీకాకుళం జిల్లా పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్ కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రిన్సిపాల్ సౌమ్యను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురి చేయడం క్షమించరాని నేరమన్నారు. రాత్రి 10 గంటలు దాటిన వరకు టీడీపీ కార్యాలయంలో సౌమ్యను ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆమెను బదిలీ చేశారని ఆరోపించారు. ఆత్మహత్యాయత్నం చేసుకునే పరిస్థితికి ఆమెను తీసుకువచ్చిన ఎమ్మెల్యేపై ప్రభుత్వం విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల్లో ప్రతిభాన్వేషణ

- విద్యార్థి, విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 30 రిజిస్ట్రేషన్లకు తుదిగడువు
- మూడు విడతల్లో పరీక్ష

పార్వతీపురంటౌన్: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు, పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తోంది. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంటుంది. అలాగే నెలకు రూ. 2000 వేలు చొప్పున సంవత్సరానికి రూ.24 వేలు స్కాలర్‌షిప్ అందుకునే అవకాశం ఉంటుంది.



దరఖాస్తుల ఆహ్వానం

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబరు 30వ తేదీలోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష ఆన్ లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్, మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలతో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశముంది.

జూనియర్, సీనియర్ విభాగాల్లో

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6 నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతులకు విడివిడిగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లీషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక ఇలా..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారిగా ప్రతిభ చూపిన మొదటి 25 మందిని ఎంపిక చేస్తారు. 6–11 తరగతులకు గాను మొత్తం 150 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతో పాటు మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తారు.

వ్యక్తిగతంగా లేదా.. పాఠశాలల నుంచి



పరీక్షలు రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌జీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవవచ్చు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జి.లక్ష్మణ రావు, జిల్లా సైన్స్ అధికారి

సృజనాత్మకతను వెలికి తీసేందుకే..



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ చక్కని వేదికగా నిలుస్తుంది. సైన్స్ పట్ల అభిరుచిని పెంచడం, వారిని శాస్త్రవేత్తలుగా తయారు చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ పరీక్షలో ప్రభుత్వ, ఇతర యాజమాన్య, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు.

– బి.రాజకుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల వంతున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు నెలకు 2000 చొప్పున సంవత్సరం పాటు భాస్కర ఉపకార వేతనం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025–26లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీవో, ఇస్రో, సీఎస్‌ఐఆర్, బీఏఆర్‌సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1–3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

100 మార్కులకు పరీక్ష..

ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్షలను 1 సెప్టెంబర్ నుంచి నిర్వహిస్తారు.పాఠశాల స్థాయి ప్రధాన పరీక్ష అక్టోబర్ 28 నుంచి 30 తేదీ వరకు నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారికి లెవెల్ 2 ద్వితీయ పరీక్ష ఆన్‌లైన్ ప్రోక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో 19 నవంబర్ తేదీన ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. లెవెల్ 1 ప్రధాన పరీక్షలో ప్రతి తరగతికి సంబంధించిన 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వంతున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్–ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు(20మార్కులు),సత్యేంద్రనాథ్ బోస్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు(20 మార్కులు), సెక్షన్–బిలో 6 నుంచి 11 తరగతులకు సంబంధించి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు(50 మార్కులు), లాజిక్, రీజనింగ్ 10 ప్రశ్నలు(10మార్కులు) ఉంటాయి. ఇందు ఉత్తీర్ణులైన వారికి లెవెల్ 2 ద్వితీయ పరీక్షలో 50 ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి.

ఘనంగా 9వ ఐద్వా జిల్లా మహాసభలు



ఐద్వా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రభావతి

విజయనగరం గంటస్తంభం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 9వ జిల్లా మహాసభలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. మహాసభల సందర్భంగా ముందుగా జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి యూత్ హాస్టల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముందు భాగంలో 9మంది మహిళలు ఐద్వా జెండాలు చేతపట్టి నడిచారు. అనంతరం యూత్ హాస్టల్‌లో జరిగిన మహాసభలకు ఐద్వా జెండాను రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రభావతి మాట్లాడుతూ...రాష్ట్రంలో మహిళల సమస్యల పరిష్కారంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నేడు ప్రతి రోజు 50 మందికి తక్కువ కాకుండా మహిళలపై రాష్ట్రంలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. నేడు విస్తారంగా రాష్ట్రంలో మద్యం దుకాణాలు జనాల ప్రాతిపదికన పెంచడంలో ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ అదే జనాభా ప్రాతిపదికన తాగునీరు అందించడంలో, పేదలకు ఇళ్లు ఇవ్వడంలో, మహిళల మీద దాడులను నియంత్రించడంలో, లైంగిక వేధింపులు అరికట్టడంలో చిత్తశుద్ధి లేదన్నారు. మహిళల హక్కుల మీద దాడి జరుగుతోందని, సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయడం లేదన్నారు. మరో వైపు ప్రభుత్వం మహిళల ఖాతాల్లో డబ్బులు వేస్తామని ప్రకటించినప్పటికీ అమలు కాలేదన్నారు.

భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు

రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత బస్సు అని చెప్పి నేడు కేవలం పల్లె వెలుగు వంటి బస్సులకు మాత్రమే అవకాశం కల్పించి చేతులు దులుపుకున్నారన్నారు. మరోవైపు మైక్రో ఫైనాన్స్ వేధింపులు తీవ్ర స్థాయిలో ఉన్నాయన్నారు. మైక్రో ఫైనాన్స్‌లు నియంత్రణకు చట్టం చేయాలని మహాసభ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. మహిళలు హక్కులు కోసం , ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో మహిళలు సమస్యలు పరిరష్కారం కోసం మహాసభల్లో నిర్ణయాలు చేసి, భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

అమృత్ భారత్ పనుల్లో జాప్యం తగదు

- పనులు పరిశీలించిన రైల్వే డివిజనల్ మేనేజర్



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ బోరా

పార్వతీపురంటౌన్: అమృత్ భారత్ పనుల్లో జాప్యం తగదని రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ బోరా అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ నూతన స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రయాణికులకు కొద్ది రోజుల్లోనే అధునాతన రైల్వేస్టేషన్‌ను అందుబాటులో తీసుకువస్తామన్నారు. అమృత్ భారత్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతనంగా ఎఫ్ఓబీ, టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, వెయింటిగ్ హాల్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న స్టేషన్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్టేషన్ అభివృద్ధికి సిబ్బంది అంకిత భావంతో పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.సాందీప్, సీనియర్ డీఎన్, ఏడీఎన్ తదితరులు పాల్గొన్నారు.

'ఓవర్ స్పీడ్' వాహనాలపై ప్రత్యేక డ్రైవ్

- 23 కేసుల నమోదు
- రూ.25,665 వసూలు



ప్రత్యేక డ్రైవ్ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బ్లాక్ స్పాట్స్, హైవేలు, ముఖ్య కూడళ్ల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టి 'ఓవర్ స్పీడ్' తో వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11 నుంచి 17 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా అతివేగంతో వెళ్లే వాహనాలపై 23 కేసులు నమోదు చేసి, ఈ చలానా కింద రూ.25,665/ లను విధించామని చెప్పారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బ్లాక్ స్పాట్స్ వద్ద వాహన తనిఖీలు చేపట్టామన్నారు. అతివేగంతో వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను సంబంధిత అధికారులు వివరిస్తూ, వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలని, తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి వాహనదారు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, సురక్షితంగా గమ్య స్థానాలు చేరుకోవాలని హితవు పలికారు. రహదారి భద్రత నియమాలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యా రెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించారని తెలియజేశారు.

జాతీయస్థాయి పోటీలకు క్యాంపస్ చాలెంజ్ విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్ విద్యార్థులు జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 9న విశాఖలో పారా రాష్ట్రస్థాయి, జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో క్యాంపస్ చాలెంజ్‌కు చెందిన ఓట్ల రామచరణ్‌తేజ లాంగ్‌జంప్, కొణతాల సోములమ్మ షార్ట్ పుట్, 100 మీటర్లు, 400 మీటర్లు రన్నింగ్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 29 నుంచి 31 వతేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీలలో వారు పాల్గొనున్నారు. జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దయానంద్, క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ సత్యనారాయణ శర్మ, ప్రిన్సిపాల్ గాయత్రి, కోచ్ గౌరి అభినందించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడిలో అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ దగ్గర వనంగుడిలో అమ్మవారికి నేతేటి ప్రశాంత్ ప్రత్యేక పూజలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావి చెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈఓ కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

పార్వతీపురం టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం జిల్లా కేంద్రంలో పర్యటించారు. చాయ్ పే చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొన్న సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చాయ్ పే చర్చలో అనేక సమస్యల్ని తెలుసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తాను అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. నామినేటెడ్ పదవుల కేటాయింపులో టీడీపీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ప్రభుత్వం తమకు ఆహ్వానించడం లేదన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీ విద్యా సర్వమంగళపీఠంలో దక్షిణామూర్తి భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ఉట్లోత్సవం

- వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు



రామతీర్థంలోని అయ్యవార్ల మేడ వద్ద ఉట్లోత్సవాన్ని ప్రారంభిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: శ్రావణ బహుళాష్టమిని పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో వేణుగోపాలస్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు జరిపించారు. వేకువజామున సీతారామస్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం అనంతరం యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం ఉపాలయంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామికి బహుళాష్టమి సందర్భంగా పంచామృత స్నపనం, విశేష అర్చనలు నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని ప్రత్యేక పల్లకిలో గ్రామ తిరువీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం స్థానిక అయ్యవార్ల మేడ వద్ద ప్రధాన ఘట్టమైన ఉట్లోత్సవాన్ని వేడుకగా జరిపించారు. ఉట్టిని కొట్టేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, కిరణ్, రామగోపాల్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

జీవి చిన్నదే.. ప్రమాదం పెద్దది

- వణుకు పుట్టిస్తున్న మశకాలు
- రోజురోజుకు పెరుగుతున్న దోమకారక జ్వరాలు
- నేడు ప్రపంచ దోమల నివారణ దినం



ఇంట్లో దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది



యాంటీలార్వా ఆపరేషన్ చేపడుతున్న సిబ్బంది (ఫైల్)

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో దోమలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీలతో పాటు అక్కడక్కడ చికెన్‌గున్యా వంటి జ్వరాలను వ్యాప్తి చేస్తూ నిత్యం వేలాది మంది ప్రజలు ఆస్పత్రుల పాలయ్యేలా చేస్తున్నాయి. వాటి నివారణకు ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా రోజురోజుకు దోమల తీవ్రత పెరుగుతూనే ఉంది. పట్టణాలతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఈనెల 20న ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

దోమల దినంగా ఎందుకంటే..

ప్రపంచానికి కామన్ శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్ రోనాల్డ్ రాస్ శతాబ్దం క్రితమే రంగంలోకి దిగి 1897లో దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. లండన్ స్కూల్ ఆఫ్ హైజెనిక్ అండ్ ట్రాపికల్ మెడిసన్ ఈసందర్భాన్ని పురస్కరించుకుని ఆగస్టు 20న అంతర్జాతీయ దోమల నివారణ దినంగా ప్రకటించింది.

అరికట్టేదెలా..

దోమ ఎగురుతున్నపుడు పట్టుకోవడం, చంపడం చాలా కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. కానీ దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నప్పుడు వాటిని నాశనం చేయడం చాలా సులువు. ఇవి ఇంటిలో నీటిని నిల్వ చేసే కుండీల్లో చిన్నచిన్న పురుగుల్లా కనిపిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటి పురుగులు, జలగలు అని పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు (లార్వా) నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి. ఇలా చేయడం వల్ల లార్వా, ప్యూపా దశల్లో ఉన్న వాటిని వందల సంఖ్యలో నాశనం చేయవచ్చు.

దోమలపై దాడికి లక్షల్లో ఖర్చు..

దోమలు ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతి నెలా పచారీ సామగ్రి మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్, మస్కిటో ధూప్ స్టిక్స్ వంటి వాటికి నెలకు రూ.100 నుంచి రూ.500 వరకు ఒక్కో కుటుంబం ఖర్చు చేస్తుంది.

ఆడదోమలే ప్రమాదకరం..

మగ దోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. ఆడ దోమలు మాత్రం సంతానాభివృద్ధిలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీల్చుతుంటాయి. ఈక్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినప్పుడు రక్తంతో పాటు వ్యాధి కారకమైన పారాసైట్ దోమ లాలాజల గ్రంథుల్లోకి చేరుతుంది. అక్కడ పారాసైట్‌లో కొన్ని మార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని దోమ కుట్టినప్పుడు లాలా జలంతో పాటు పారసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతాయి.

నివారణ ఇలాచేద్దాం...

- దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విష జ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు దోమలే కారణం. మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ వంటివి మనం దోమల నివారణకు ఇంట్లో వాడతాం. వాటివల్ల కొందరికి శ్వాసకోస వ్యాధులు వస్తాయి. ఈ నివారణ చర్యలు చేపడితే మంచిదే.
- వేపనూనె దోమలను తరిమికొట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దీని వాసన దోమలు భరించలేవు. వేప, కొబ్బరినూనెలను సమాన భాగాలుగా చేసుకుని బయటకు కనిపించే శరీర భాగాలపై రాసుకుంటే దోమలు దరిచేరవు.
- ఇళ్లల్లోకి దోమలు ప్రవేశించే కిటికీల వంటి ద్వారాల వద్ద తులసి మొక్కలను పెంచాలి. ఇవి దోమలను దూరం చేస్తాయి. దోమల వృద్ధి లేకుండా చూస్తాయి.
- లెమన్ ఆయిల్, యూకలిప్టస్ ఆయిల్ మిశ్రమం దోమలను తరిమికొడుతుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్‌గానే కాకుండా ఇన్‌సెక్ట్ రిప్లెంట్‌గాను పనిచేస్తుంది.
- కర్పూరం మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాలను మూసిన తర్వాత కర్పూరాన్ని వెలిగిస్తే దానినుంచి వచ్చే పొగకు దోమలు మాయమవుతాయి.

దోమల నివారణకు విస్తృత చర్యలు



దోమల నివారణకు విస్తృతంగా చర్యలు చేపట్టాం. ఐఆర్ఎస్ ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని ప్రతి ఒక్క ఇంట్లో స్ప్రేయింగ్ చేసుకోవాలని చెబుతున్నాం. గంబూషియా చేపలను కూడా మురికి కుంటల్లో వేస్తున్నాం.

– పీవీ సత్యనారాయణ, డీఎంఓ, సీతంపేట ఐటీడీఏ

అవగాహన కల్పిస్తున్నాం



దోమ కారక వ్యాధులు ప్రబలకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. యాంటీ లార్వా ఆపరేషన్ చేపడుతున్నాం. మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు సంబంధిత పీహెచ్‌సీల్లో కూడా పూర్తిస్థాయిలో మందులు ఉంటున్నాయి.

– జె.మోహన్‌రావు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్, సీతంపేట

గంజాయితో ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్:

గంజాయి అక్రమంగా రవాణా చేస్తుండగా ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ ఆర్వీఆర్‌కే చౌదరి మాట్లాడుతూ నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో సూర్య లాడ్జి వద్ద కేరళకు చెందిన రైదాస్ గంట(25) అంతర్యామి మాలిక్ (23)లు రెండు నల్ల బ్యాగ్‌లలో రూ.యాభై వేల విలువ గల పది కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా దొరికిపోయారన్నారు. ఇద్దరు నిందితులను తమకు అందిన సమాచారం మేరకు పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు.

గజపతినగరంలో మరొకరు..

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన పారాది మోహన్ మురళీ కృష్ణ గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా సమాచారం అందుకుని పట్టుకున్నట్లు గజపతినగరం సీఐ ఏవీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మురళీకృష్ణ తన మిత్రుడు పల్లి నవీన్‌తో కలిసి ఒడిశాలోని రాయగడలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి విజయనగరం రైల్వే స్టేషన్ వద్ద కొంతమంది వ్యక్తులకు విక్రయిస్తున్నాడని తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కేజీన్నర గంజాయిని విజయనగరంలో అమ్మేందుకు తరలిస్తుండగా స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు మాటువేసి పట్టుకున్నామన్నారు. పారాది మోహన్ మురళిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. పల్లి నవీన్‌ను ఇంకా పట్టుకోవాల్సి ఉందని గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అందివస్తాడనుకుంటే అనంతలోకాలకు...

- శోక సంద్రంలో శ్రీహరినాయుడుపేట



సాయికిరణ్(ఫైల్)

సంతకవిటి: డిగ్రీ విద్య పూర్తిచేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న కుమారుడు ఉద్యోగం సాధిస్తే కష్టాలు గట్టెక్కుతాయని ఆ తల్లిదండ్రులు భావించారు. చివరికి ఉద్యోగం కోసం సాగించే పరుగులోనే కుమారుడు కుప్పకూలి ప్రాణాలు విడవడంతో బోరున విలపిస్తున్నారు. సంతకవిటి మండలం శ్రీహరినాయుడుపేట గ్రామానికి చెందిన గండ్రేటి సాయికిరణ్(20) మంగళవారం కాకినాడలో జరిగిన అగ్నిపథ్ ర్యాలీలో 1600 మీటర్ల పరుగుపందెంలో పాల్గొని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడి సిబ్బంది కాకినాడలోని జీజీహెచ్‌లో చేర్పించినా ఫలితం లేకపోయింది. కుమారుడి మృతివార్త తెలుసుకున్న తల్లిదండ్రులు అప్పన్న, భారతిలు కాకినాడ బయలుదేరి వెళ్లారు. వీరికి సాయికిరణ్‌తో పాటు ఇంటర్ చదువుతున్న కుమార్తె ఉంది. అందివస్తాడనుకున్న కొడుకు తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో విషాదం అలముకుంది.